సాక్షి
పెద్దపల్లి

ఆదివారం । 21 । జనవరి । 2024



వేడుకలపై సమీక్ష
రామగిరి: రాణీరుద్రమదేవి క్రీడా ప్రాంగాణంలో చేపట్టే గణతంత్ర వేడుకలపై జీఎం సుధాకర్‌రావు అధికారులతో సమీక్షించారు.



ఎన్టీపీసీలో ఎన్నికల అధికారి
జ్యోతినగర్: ఎన్టీపీసీ జ్యోతిభవన్‌కు చేరుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథికి అడిషనల్ కలెక్టర్లు స్వాగతం పలికారు.

గరిష్ఠం/కనిష్ఠం
29.4/20.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఉదయం. సాయంత్రం చలి పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సింగరేణిలో డైరెక్టర్ పర్యటన



ఓసీపీ పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

గోదావరిఖని/రామగిరి(మంథని): ఆర్జీ–3 ఏరియాలో సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి పర్యటించారు. ఓసీపీ –1, 2 ఉపరితల గనుల్లోని పనులు పరిశీలించారు. అధికారులతో బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. నిర్దేశిత బొగ్గు, ఓబీ లక్ష్యాలు భద్రతతో సాధించుకోవాలని సూచించారు. ప్రణాళికల గురించి జీఎం సుధాకర్‌రావు వివరించారు. ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, కె.రాజేందర్, ప్రాజెక్టు ఇంజినీర్లు ఆర్.శ్రీనివాస్, నాగరాజు, మేనేజర్లు ఉదయ్ హరిజన్, కేవీ రామరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు కేంద్రాల పరిశీలన



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

కమాన్‌పూర్: గుండారం, కమాన్‌పూర్, జూలపల్లిలోని ఓటరు నమోదు కేంద్రాలను మంథని ఆర్డీవో హనుమా నాయక్ శనివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్లాస్టిక్ బ్యాగులు వద్దు



పోస్టర్ల ద్వారా ప్రచారం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ప్రాంతంలో క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించరాదని ఆ సంస్థ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ గ్రూపు(ఈఎంజీ) ఆధ్వర్యంలో పోస్టర్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ప్రధాన దుకాణ సముదాయానికి కొనుగోళ్ల కోసం వచ్చిన వారు ఇంటి నుంచి వస్త్రం/జనపనార, పర్యావరణ అనుకూల సంచులు తీసుకురావాలని సూచించారు. దుకాణదారులు పాలిథిన్ సంచులను అంగీకరించరాదని, పాలిథిన్ సంచుల వినియోగాన్ని మానుకోవాలని సంస్థ తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో పోస్టర్లు ముద్రించి ప్రచారం చేస్తోంది.

దరఖాస్తుల ఆహ్వానం
మంథని: మంథని మైనార్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం వచ్చే నెల 6లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అస్మాజబీన్ కోరారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 80962 86629, 91543 65025 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

రేపు సదరం శిబిరం
కమాన్‌పూర్: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 22న సదరం శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి అశోక్‌కుమార్, ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఒకపూట సెలవు
ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 2.30గంటల వరకే ఉద్యోగులకు విధులు ఉంటాయని ఆర్‌ఎఫ్‌సీఎల్ లోయిడా హెచ్‌ఆర్ విభాగం ఉత్తర్వులు జారీచేసింది. ఆర్‌ఎఫ్‌సీఎల్, ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్పొరేట్ ఆఫీస్, నోయిడా, రామగుండం యూనిట్లలో ఒకపూట సెలవు ప్రకటించినట్లు ఉత్తర్వుల్లో వివరించారు.

24 వరకు గడువు పొడిగింపు
పెద్దపల్లిరూరల్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందించే ఉచిత శిక్షణ పొందేందుకు ఆసక్తి, అర్హత గలవారి నుంచి దరఖాస్తులు స్వీకరించే గడువును ఈనెల 24 వరకు పొడిగించినట్లు కరీంనగర్ డైరెక్టర్ రవికుమార్ శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 0878–2268686 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

బాలరాముడిని చూసొద్దాం

అయోధ్యకు దక్షిణ మధ్య ప్రత్యేక రైళ్లు

- ఉమ్మడి జిల్లా మీదుగా పలు రైళ్లు
- ఖాజీపేట, సికింద్రాబాద్, జాల్నా నుంచి ప్రారంభం
- 29 నుంచి బుకింగ్ షురూ..
- రైళ్ల సంఖ్య పెంచాలని కోరుతున్న భక్తులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అయోధ్య రామాలయంలో రాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని దేశంలోని నలుమూలల నుంచి భక్తులు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడిపేందుకు సిద్ధమైంది. అందులో పలు రైళ్లను ఉమ్మడి జిల్లా భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. మూడు ప్రత్యేక రైళ్లు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల మీదుగా అయోధ్య వెళ్లనున్నాయి. ఒకటి మహారాష్ట్ర నుంచి నిజామాబాద్–కరీంనగర్–పెద్దపల్లి ప్రాంతాల మీదుగా అయోధ్యకు వెళ్తుంది. మరో రెండు రైళ్లలో ఒకటి సికింద్రాబాద్, మరోటి ఖాజీపేట నుంచి బయలుదేరి పెద్దపల్లి, రామగుండం మీదుగా అయోధ్య నగరాన్ని చేరుకుంటాయి. ఈనెల 29 నుంచి బుకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. ఆధ్యాత్మిక ప్రాంతాల పర్యటనకు ఉద్దేశించిన ఈ ప్రత్యేక రైళ్లను ఆస్తా రైళ్లుగా పిలుస్తారు. ఇందులో 22 కోచ్‌లు ఉండగా 20 స్లీపర్ బోగీలు(రిజర్వుడు) రెండు మాత్రం సాధారణ బోగీలు ఉంటాయి.



కాజీపేట నుంచి..
రైలు నంబర్.. 07223 కాజీపేట జంక్షన్ నుంచి ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 28 వరకు వారంలో మూడు రోజులు(మొత్తం 15 ట్రిప్పులు) నడుస్తాయి. జనవరి 30వ తేదీ, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో సాయంత్రం కాజీపేట జంక్షన్ నుంచి 06:20 నిమిషాలకు బయలుదేరుతుంది. పెద్దపల్లి జంక్షన్‌కు 7:38 గంటలకు, రామగుండం నుంచి 8:00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు(ఒక రోజు ప్రయాణం తర్వాత) ఉదయం 3:35 గంటలకు అయోధ్య ధాం జంక్షన్‌కు చేరుకుంటుంది.

- ఇదే రైలు తిరుగు ప్రయాణంలో నంబర్.. 07224 ఫిబ్రవరి 2, 4, 6, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, మార్చి 2వ తేదీన మొత్తం(15 ట్రిప్పులు) ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. ఈ రైలు అయోధ్య ధాం జంక్షన్ నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ రైళ్లు అయోధ్య ధాం జంక్షన్ నుంచి వచ్చేటప్పుడు రామగుండంకు సాయంత్రం 6:30 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 7 గంటలకు చేరుకుంటాయి.

సికింద్రాబాద్ నుంచి..
రైలు నంబర్.. 07221 సికింద్రాబాద్ నుంచి అయోధ్య ధాం జంక్షన్ రైల్వేస్టేషన్‌కు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 29 వరకు వారంలో మూడు రోజులు (మొత్తం 16 ట్రిప్పులు) ఈ రైళ్లు నడుస్తాయి, జనవరి 29, 31 తేదీలు, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29 తేదీలలో సాయంత్రం 4:45 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌లో బయలుదేరుతుంది. కాజీపేట జంక్షన్‌కు సాయంత్రం 6:20 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 7:38, రామగుండం 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు(ఒక రోజు ప్రయాణం తర్వాత) ఉదయం 3:30 గంటలకు అయోధ్య చేరుకుంటాయి.

- ఇదే రైలు తిరుగు ప్రయాణంలో నంబర్.. 07222తో ఫిబ్రవరి 1, 3, 5, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 ఇంకా మార్చి 1, 3 తేదీల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి, ఈ రైలు అయోధ్య ధామ్ జంక్షన్ నుంచి మధ్యాహ్నం 2:20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10:30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుకుంటుంది. ఈ రైళ్లు రామగుండంకు సాయంత్రం 6:30, పెద్దపల్లి జంక్షన్‌కు 7:00, కాజీపేట జంక్షన్‌కు 8:08 గంటలకు చేరుకుంటాయి.

జగిత్యాల-కరీంనగర్-పెద్దపల్లి మీదుగా
రైలు నంబర్.. 07649 జాల్నా నుంచి ఫిబ్రవరి 4న(ఆదివారం) ఉదయం 9:30 గంటలకు జాల్నా రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి కోరుట్ల సాయంత్రం 5:18 గంటలకు, లింగంపేట్ జగిత్యాల సాయంత్రం 5:50, కరీంనగర్ రైల్వేస్టేషన్ సాయంత్రం 6:45, పెద్దపల్లి జంక్షన్‌కు రాత్రి 7:35, రామగుండంకు రాత్రి 8:00, అయోధ్య మంగళవారం తెల్లవారుజామున 3:35 గంటలకు చేరుకుంటుంది.

- ఇదే రైలు తిరుగుప్రయాణంలో నంబర్.. 07650 ఫిబ్రవరి 6న బుధవారం మధ్యాహ్నం 2:20 గంటలకు అయోధ్య ధామ్ జంక్షన్ నుంచి బయలుదేరి రామగుండానికి గురువారం సాయంత్రం 7:25 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 7:55, కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు రాత్రి 8:35, లింగంపేట జగిత్యాల రైల్వేస్టేషన్‌కు 9:20, కోరుట్ల రైల్వేస్టేషన్‌కు రాత్రి 9:50 గంటలకు చేరుకుంటుంది.

రైళ్ల సంఖ్య పెంచాలి



జాల్నా నుంచి జగిత్యాల–కరీంనగర్–పెద్దపల్లి మీదుగా అయోధ్యకు ఒకటే రైలు వేశారు. వాస్తవానికి ఈ రైలుతో సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి మొత్తం నాలుగు జిల్లాల ప్రజలకు అయోధ్యకు వెళ్లే అవకాశం ఉంది. ఈ మార్గంలో మరిన్ని ప్రత్యేక రైళ్లు వేయాలి. అదే విధంగా కరీంనగర్‌లో జమ్మికుంటకు హాల్టింగ్ సదుపాయం కల్పిస్తే హన్మకొండ–కరీంనగర్ జిల్లా వాసులకు ఉపయుక్తంగా ఉంటుంది.

– ఫణి, సామాజిక ఉద్యమకారుడు

‘స్వచ్ఛ’ గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: పల్లె ప్రజలకు స్వచ్ఛత, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) సమావేశంలో కలెక్టర్‌తోపాటు అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు. పల్లెలన్నీ పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారనే విషయంపై విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లావాసులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో స్వచ్ఛతలో జిల్లా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని, అదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. వార్డుల వారీగా పారిశుధ్య నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. చెత్త, చెదారాన్ని రోడ్లపై పడేయకుండా అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు సేకరించి, చెత్తతో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని అన్నారు. డంపింగ్‌యార్డుల వరకు సీసీ రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. డీఆర్డీవో శ్రీధర్, డీపీవో చంద్రమౌళి, సీపీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో మంచి ఫలితాలుండాలి

పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి జిల్లాను అగ్రభాగాన నిలపాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. టెస్ట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీఈవో మాధవితో కలిసి వార్షిక పరీక్షలపై సమీక్షించారు. డీపీవో చంద్రమౌళితోపాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి..

అధికారులు బాధ్యతగా పనిచేయాలని, తమశాఖ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్లు శ్యామ్‌ప్రసాద్‌లాల్, అరుణశ్రీతో కలిసి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. ప్రజావాణి, సీఎం కార్యాలయం నుంచి అందే వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ బండి ప్రకాశ్, డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

హక్కుల సాధనలో అనేక సవాళ్లు



ఎగ్జిబిట్‌లు పరిశీలిస్తున్న ఈడీ రంజన్ పాండు

జ్యోతినగర్(రామగుండం): ఆడపిల్లలు తమ గళం వినిపించే అవకాశాలు పెరిగినా .. హక్కుల సాధనలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారని ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. శనివారం టీటీఎస్‌లోని ఉద్యోగ వికాసం కేంద్రంలో బాలికా సాధికారత మిషన్‌లో భాగంగా ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. విద్యారంగంలో సమాన అవకాశాలను పొందలేని దైన్యం నేటికీ కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. శారీరక, మానసిక, ఆరోగ్య సంరక్షణ దిశగా బాలికలకు పూర్తిస్థాయిలో అత్యున్నత శిక్షణ పొంది, భవిష్యత్‌కు మార్గాలు అన్వేషించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ నైపుణ్యాలను ప్రదర్శించారు. జీఎం అనిల్‌కుమార్ వేముల తదితరులు పాల్గొన్నారు.

సర్వం.. రామమయం









అయోధ్యలో రామాలయం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశవ్యాప్తంగా రామనామం మార్మోగుతోంది. భక్తులు ఎవరికి తోచిన రీతిలో వారు భక్తిచాటుకుంటున్నారు. సోమవారం ప్రాణప్రతిష్ఠ జరగనుండగా.. మూడురోజుల ముందుగానే మహిళలు దీపాలు వెలిగించి వేడుకలు ఆరంభించారు. యువతీయువకులు తమ శరీరాలపై జైశ్రీరాం, రాముని చిత్రాలను టాటూలుగా వేసుకుని భక్తి చాటుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఇంటి ఎదుట మహిళలు దీపాలు వెలిగిస్తూ మూడు రోజుల సంబురాలకు శనివారం అంకురార్పణ చేశారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు జైశ్రీరాం ఆకృతిలో చేసిన ప్రదర్శనలు, సీతారామ వేషధారణలు ఆకట్టుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

త్వరలో మైనింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్

- సింగరేణి ప్లానింగ్, ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

రామగిరి(మంథని): సింగరేణిలో త్వరలోనే మైనింగ్ ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీచేస్తామని ఆ సంస్థ ప్లానింగ్, ప్రాజెక్టు డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. మైనింగ్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు మైనింగ్‌లో నైపుణ్యం, పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. స్థానిక జేఎన్టీయూలో ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన ‘కోల్ మైనింగ్ భవిష్యత్’పై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ మైనింగ్‌పై ఆధారపడి ఉందన్నారు. మినరల్స్‌లో కోల్ అతిముఖ్యమైనదని, నేడు థర్మల్ ద్వారా 50 శాతానికిపైగా విద్యుత్ ఉత్పత్తి అవుతోందని తెలిపారు. ఈసారి మైనింగ్ ఉద్యోగాల్లో బాలికలకు సైతం అవకాశం కల్పిస్తున్నామని, మంథని విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉద్యోగాలు దక్కించుకోవాలని కోరారు. మంథని జేఎన్టీయూకు సింగరేణి సంస్థ చేయూత అందిస్తుందని అన్నారు. అనంతరం మైనింగ్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు మైనింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సింగరేణి స్టూడెంట్ చాప్టర్‌ను ఆయన ప్రారంభించారు. ఆర్జీ–2, 3 జీఎంలు ఎల్వీ సూర్యనారాయణ, ఎస్.సుధాకర్‌రావు, సింగరేణి చాప్టర్ సెక్రటరీ ఏఎల్ఎస్‌వీ సునీల్‌వర్మ ఉన్నారు.

సర్కార్ బడుల్లో ఎన్నికల సందడి

- ఐదేళ్ల తర్వాత నిర్వహణ
- 22న అభ్యంతరాల స్వీకరణ
- 24న అభ్యర్థుల జాబితా ప్రకటన
- 29న ఎన్నికలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది. 2018 సంవత్సరం తర్వాత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించలేదు. అప్పటి నుంచి పాత కమిటీనే కొనసాగిస్తూ వస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారుల విన్నపం మేరకు ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో 10 మోడల్, 7 కస్తూరిబా గాంధీ బాలికలు, 6 సోషల్ వెల్ఫేర్ గురుకులాలు, 100 జెడ్పీహెచ్ఎస్‌లు, 373 పీఎస్‌లు, 140 వరకు యూపీఎస్‌లు ఉన్నాయి.

తల్లిదండ్రులకు ఓటుహక్కు..

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల తల్లితండ్రులకు ఓటుహక్కు ఉంటుంది.
- 20న ఎన్నికల నోటిఫికేషన్ జారీకాగా, పోటీ చేసే తల్లిదండ్రుల జాబితా ప్రదర్శించారు.
- 22న జాబితాపై హెచ్ఎంలు అభ్యంతరాలు స్వీకరిస్తారు.
- ఈనెల 24న తుది జాబితాల ప్రకటిస్తారు.



సుల్తానాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

- 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహిస్తారు.
- మధ్యాహ్నం 1.30 గంటల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాత సభ్యులతో తొలిసమావేశం నిర్వహిస్తారు.
- చైర్మన్, వైస్ చైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఎస్ఎంసీలో ఉంటారు.
- వీరితోపాటు మరో ఐదుగురు ఎక్స్‌అఫిషియో సభ్యులు, ఇద్దరు కో ఆప్టెడ్ సభ్యులు ఉంటారు.
- హెచ్ఎం మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.
- ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులే సభ్యులుగా ఉంటారు.
- 50శాతం తల్లిదండ్రులు ఎన్నికలు నిర్వహించే సమావేశానికి హాజరు కావాలి.
- చెతులు ఎత్తే పద్ధతి/వాయిస్ వోట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తారు.

పాఠశాలలకు రాజకీయ రంగు

అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీలు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దీంతో రాజకీయంగా తమ అనుచరులను గెలిపించుకునేందుకు అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులు ప్రణాళిక రూపొందించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుదారుల పిల్లలు సర్కార్ స్కూల్లలో చదువుతున్నారు. దీంతో తమ అనుచరులే విజయం సాధించాలనే లక్ష్యంతో నాయకులు పావులు కదుపుతున్నారు.

సమాచారం ఇచ్చాం



జిల్లాలో పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలని, ఇందుకు అవసరమైన ఓటరు జాబితా తయారు చేయాలని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చాం. తల్లిదండ్రుల జాబితా హెచ్‌ఎంలు తయారు చేశారు.

– మాధవి, జిల్లా విద్యాధికారి

మహిళా సాధికారత సాధిద్దాం



సంతకం చేస్తున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: మహిళా సాధికారిత సాధించేందుకు వీలుగా ప్రతీఒక్కరు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి కలెక్టర్ తమవంతుగా మద్దతు ప్రకటిస్తూ సంతకం చేశారు. మహిళాసాధికారిత, బాలికా దినోత్సవం, భేటీబచావో.. భేటీ పడావో కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లా స్థాయి అధికారులు రవుఫ్‌ఖాన్, చంద్రమౌళి, శ్రీధర్, శ్రీనివాస్, తహసీల్దార్లు, కో ఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్టు సుచరిత, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సింగరేణి డైరెక్టర్(పా)గా శ్రీనివాస్


శ్రీనివాస్

గోదావరిఖని: ఆపరేషన్స్ డైరెక్టర్ పనిచేస్తున్న ఎస్వీకే శ్రీనివాస్‌కు డైరెక్టర్(పా)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు శనివారం యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం డైరెక్టర్(పా)గా పనిచేస్తున్న బలరాం సంస్థ సీఅండ్ఎండీగా నియామకం కావడంతో ఆయన స్థానంలో శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీఅయ్యాయి.

మృతుల కుటుంబాలకు పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: ఇటీవల కల్లు తాగి మృతి చెందిన అడ్డగుంటపల్లి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మామిడి రమేశ్, నవీన్ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం పరామర్శించారు. బాధితులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఇద్దరు కల్లుతాగి మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ కొమ్ము వేణుగోపాల్, నాయకులు అచ్చే వేణు, చెలకలపల్లి శ్రీనివాస్, మేకల తిరుపతి, మేతుకు దేవరాజ్ ఉన్నారు.

నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఎస్సీ వర్గీకరణపై భారత ప్రధాని నరేంద్రమోదీ కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణపై ఇచ్చిన హామీ ప్రకారం కేంద్రప్రభుత్వం కమిటీ వేసిందన్నారు. షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాలు కాపాడేందుకు మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఈనెల 23న కమిటీ సమావేశం కానుందన్నారు. ఎన్నికల హామీలతోపాటు అదనంగా పేదప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు మోదీ ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి రాంచందర్, మామిడి రాజేశ్, మాతంగి రేణుక, సుల్వ లక్ష్మీనర్సయ్య, మామిడి సంపత్, అడ్డూరి రాజేశ్, కొమిరే లక్ష్మణ్, పంగ రవి, ఇరుగురాల శివ కుమార్, గుండ్రాతి మల్లయ్య, బంక రాజేశ్, కదాసి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వండి

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఈమేరకు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎల్లంపల్లి ఇరిగేషన్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి చివరి ఆయకట్టు వరకు సాగు, తాగునీరు అందించాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే పాలకుర్తి మండలంలోని మరికొన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరు అందుతుందన్నారు. అలాగే కార్పొరేషన్‌కు నిధులు మంజూరు అయితే డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీతోపాటు ఇతర సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గత ప్రభుత్వ వైఫల్యంతో రామగుండం నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను అమలు చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతోపాటు కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశాలను ఏర్పాటు చేసి, నిధులు తీసుకొస్తున్నారన్నారు. పాలకుర్తి, అంతర్గాంలోని ప్రభుత్వ భవనాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. రామగుండం కార్పొరేషన్‌కు రూ.300 కోట్లు కేటాయించాలని కోరారు. పంచాయతీరాజ్ తరఫున రూ.40 కోట్లు కేటాయించాలని విన్నవించారు.

మోడల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దాలి

పారిశ్రామిక ప్రాంతంలోని కీలక గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్‌ను మోడల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కోరారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదాయ వనరుల పెంపు కోసం పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా పునరుద్ధరించాలన్నారు. బడుగు, బలహీన వర్గాల నిరుపేద విద్యార్థుల సౌకర్యార్థం మెరుగైన విద్య అందించేందుకు మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాన్ని రూ.35 కోట్లతో ఏర్పాటు చేయాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

గోదావరిఖని: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందింది. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై స్వామి కథనం ప్రకారం.. స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన ఎం.వైశాలి(24)అలియాస్ సుష్మ అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. వైశాలిని 9నెలల కిందట హైదరాబాద్‌కు చెందిన మెకానిక్ సురేందర్‌కు ఇచ్చి పెళ్లి చేశారన్నారు. పెళ్లయిన కొద్దిరోజుల నుంచి ఇద్దరి మధ్య గొడవలు పెరిగాయని, ఈక్రమంలో ఈనెల 15న గోదావరిఖనిలోని తల్లిగారింటికి తీసుకొచ్చి భర్త దింపివెళ్లినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడుతుండగా, గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినా.. నయం కాలేదన్నారు. ఈక్రమంలో మొక్కుల కోసం బిజిగిరిషరీఫ్ వెళ్లగా అక్కడ పరిస్థితి విషమించగా జమ్మికుంట ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు వివరించారు. రామగుండం తహసీల్దార్ కుమారస్వామి ఆధ్వర్యంలో శవపంచనామా చేశారు.

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత


సీజ్ చేసిన రేషన్ బియ్యంతో ఎస్సై సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్(రేషన్) బియ్యాన్ని శుక్రవారం అర్ధరాత్రి సీజ్ చేసినట్లు ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన టేకుమట్ల కుమార్ ట్రాలీ ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. 25 బస్తాల్లో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు పేర్కొన్నారు. బియ్యాన్ని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, తిరుపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పత్రాలు లేని వాహనాలు సీజ్


ఆర్టీఏ అధికారులు సీజ్‌చేసిన వాహనాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలో సరైన ధ్రువీకరణపత్రాలు లేని రెండు ట్రాక్టర్ ట్రాలీలు, ఒక గూడ్స్ వాహనాన్ని శనివారం సీజ్ చేసినట్లు ఎంవీఐ కిశోర్ చంద్రారెడ్డి తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక, సరుకులు రవాణా చేసే అన్ని వాహనాలు సరైన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. సీజ్ చేసిన వాహనాలను తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

రాగినేడు శివాలయంలో హుండీ చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలోని శివాలయంలో శనివారం హుండీ చోరీ జరిగింది. అందులోని నగదును అపహరించుకెళ్లినట్టు గ్రామస్తులు తెలిపారు. ఆలయానికి వెళ్లిన భక్తులు హుండీ చోరీ అయినట్లు గుర్తించి ఆలయ కమిటీ, గ్రామ ప్రజాప్రతినిధులకు సమాచారం అందించారు. చోరీ ఘటనపై గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రిని కలుసుకున్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కె.రాజకుమార్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను జీవో22 ప్రకారం చెల్లించాలని, కోలిండియా వేతనాల అమలు కోసం సింగరేణి యాజమానికి మార్గదర్శకాలు జారీచేయాలని కోరారు. 2022లో 18 రోజుల సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందంలోని అంశాలను అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని, కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నాయకులు షేక్ అక్బర్‌అలీ, బుర్ర తిరుపతి, యర్రగాని కృష్ణయ్య, అఫ్రోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



ఎలిగేడు(పెద్దపల్లి): మండల కేంద్రంలోని ఎస్ఎస్-40, 25కేవీఏ సుల్తాన్‌పూర్ ఫీడర్‌కు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దొంగలు ధ్వంసం చేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైర్ ఎత్తుకెళ్లినట్లు ఏఈ సంపత్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ మహిపాల్ శనివారం తెలిపారు. చోరీకి గురైన కాపర్‌వైర్ విలువ దాదాపు రూ.70వేల వరకు ఉంటుందన్నారు. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కాగా గతనెలలో ర్యాకల్‌దేవుపల్లిలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి.

పల్లెకో ప్రత్యేకత

- ఉద్యోగుల పల్లె గర్జనపల్లి
- చదువులతల్లి నారాయణపూర్
- క్రీడల వేదిక దుమాల, వీర్నపల్లి
- యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న పాతతరం
- నాటి కల్లోల పల్లెలు.. నేటి ఆదర్శ గ్రామాలు

ఇది వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి. ఒకప్పటి కల్లోల పల్లెగా ముద్రపడ్డ ఈ ఊరు నేడు ఉద్యోగులతో కళకళలాడుతోంది. 600 గడప ఉన్న ఈ పల్లెలో వివిధ శాఖల్లో 235 మంది ఉద్యోగులు ఉన్నారు. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం ఆ ఊరు పేరు వింటేనే అలజడి. కానీ నేడు అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం. ఆర్టీసీ నుంచి మొదలైన ఉద్యోగాలపర్వం పోలీస్, సెస్, ఎక్సైజ్, హెల్త్ డిపార్ట్‌మెంట్లతోపాటు ఉపాధ్యాయులు, ఇంజినీర్లుగా స్థిరపడ్డ వారు ఉన్నారు.



గర్జనపల్లి

సండే స్పెషల్


దుమాలలోని క్రీడాకారులు

వాలీబాల్ ఆడుతున్న వీరు ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన క్రీడాకారులు. ఒకప్పుడు ఆ పల్లె పేరింటేనే అందరూ జంకేవారు. సాయంత్రం అయిందంటే పోలీసుల బూట్ల చప్పుళ్లు, నక్సలైట్ల పాటలతో మారుమోగేది. అలాంటి పల్లె నేడు రాష్ట్రస్థాయి క్రీడాకారులకు వేదికైంది. నక్సల్స్ అమరవీరుల స్థూపం సాక్షిగా వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేసుకొని ప్రాక్టీస్ చేస్తున్నారు. గత ముప్పై ఏళ్లుగా వివిధ క్రీడాపోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సత్తాచాటుతున్నారు. వాలీబాల్ క్రీడకు కేరాఫ్‌గా దుమాల మారింది. పదేళ్ల క్రితం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని క్రీడాకారులను, విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకు వారి వంతుగా ప్రోత్సాహం అందిస్తున్నారు.

ఇది ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్. ఈ ఊరిలో ప్రతీ ఇంట్లో బీఈడీ, పీజీలు, ఇంజినీరింగ్ చదివిన పిల్లలు కనిపిస్తారు. ఒకప్పటి ఐఏఎస్ రమణాచారి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాష కోవిదుడు నలిమెల భాస్కర్‌లను స్ఫూర్తిగా తీసుకొని ఈతరం ఉన్నత చదువులతో ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో టీచర్లు 30 మంది, ఎంబీబీఎస్ వైద్యులు ఆరుగురు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు 20, పాత్రికేయరంగంలో 8 మంది, ఉన్నత చదువులు చదివి విదేశాల్లో ఉన్నతంగా స్థిరపడ్డ వారు 30 మంది వరకు ఉన్నారు. ప్రభుత్వం నుంచి ఏ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడ్డ అందులో ఉద్యోగం సాధించిన వారు నారాయణపూర్ నుంచి ఒక్కరైనా ఉంటారు.


నారాయణపూర్ గ్రామం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నక్సలైట్ ప్రాబల్యం ఉన్న ఆ గిరిజన పల్లెల్లోకి కనీస సౌకర్యాలు రాలేవు. రోడ్లు లేక బస్సులు రాక ఆ పల్లె జనానికి కాలిబాటే దిక్కయ్యింది. అలాంటి పరిస్థితుల్లో మైళ్ల దూరంలో ఉన్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ పెద్దబడిలో చదువుకున్నారు. సమీపంలోని అన్ని గ్రామాలకు మండల కేంద్రంలోని పెద్దబడే పెద్దదిక్కు. అన్నీ కష్టాలను ఎదుర్కొన్న వారు డిగ్రీలు చదివి ఉద్యోగాలు సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఎలాంటి క్రీడామైదానాలు, ఇతరత్ర సౌకర్యాలు లేని దుమాల, వీర్నపల్లి లాంటి కుగ్రామాల్లోని యువత అవకాశాలను సద్వినియోగం చేసుకొని నిత్యం సాధన చేస్తూ వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించి ఆ పల్లెల్లోని నేటితరానికి స్ఫూర్తిగా నిలిచారు. ఇంతటి కఠిన పరిస్థితులను ఎదుర్కొని చదువుకున్న వారు నేడు జిల్లా స్థాయి అధికారులుగా ఎదిగారు. ఇటీవల సీఎం పీఆర్వోగా నియమితులైన నారాయణపూర్‌కు చెందిన బొల్గం శ్రీనివాస్‌గౌడ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, జిల్లా క్రీడాధికారి అజ్మీర రాందాస్, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బద్దిపడిగే శివారెడ్డి లాంటి వారు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఈ మట్టిలోనే ప్రత్యేకత ఉంది



మానేరువాగు పరివాహక గ్రామాల్లోని మట్టిలోనే ఏదో ప్రత్యేకత ఉంది. ఇక్కడి విద్యార్థులు, యువతలో సాధించాలనే పట్టుదల, కసి ఉంటుంది. ఈ ప్రాంతంలో ఆర్థిక పరిస్థితులు సైతం వారిని ఉన్నత చదువుల వైపు మళ్లేలా చేస్తుంది. ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు పదుల సంఖ్యలో వివిధ రంగాల్లో రాణించారు. వారిని ఇప్పటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలి.

– నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

పల్లె బిడ్డలు రాష్ట్రస్థాయికి..



ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లోని పల్లె విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. దుమాలలో చాలా మంది క్రీడాకారులు వాలీబాల్‌లో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగారు. జిల్లాలోనే ఈ ప్రాంత క్రీడాకారులు ఆటల్లో ప్రతిభ చూపుతూ గుర్తింపును తెచ్చుకుంటున్నారు. ఎలాంటి ఆర్థిక ప్రోత్సాహం లేకున్నా పట్టుదలతో ముందుకెళ్తున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని ఎదుర్కొంటూనే రాణిస్తున్నారు.

– అజ్మీర రాందాస్, జిల్లా క్రీడల అధికారి

పాతతరమే స్ఫూర్తిగా..



ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండలంలోని పలు పల్లెల్లో విద్యార్థులు, యువకులు పాత తరం ఉద్యోగులనే స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత చదువులపై దృష్టి పెడుతున్నారు. దుమాలలో పదేళ్ల క్రితం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు, క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నాం. నేటి యువతలో బాగా చదువుకొని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలనే పట్టుదల కనిపిస్తుంది.

– కదిరె శ్రీనివాస్, ఉపాధ్యాయుడు

ర్యాగింగ్ వద్దు.. భవిష్యత్ ముద్దు


మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు

- అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు
- సిమ్స్‌లో అవగాహన సదస్సు

కోల్‌సిటీ(రామగుండం): ర్యాగింగ్ వద్దు.. భవిష్యత్ ముద్దు.. ర్యాగింగ్ చట్టరీత్యా నేరం.. అమానవీయమైన ర్యాగింగ్ నివారణ అందరి బాధ్యత అని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. గోదావరిఖనిలోని సిమ్స్‌లో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ర్యాగింగ్ నివారణపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారు శిక్షార్హులని అన్నారు. ర్యాగింగ్‌ను ప్రభుత్వాలు నిషేధించాయని, బాధితులు పోషకులకు, విద్యా సంస్థల యాజమాన్యాలకు, పోలీస్‌లకు నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ర్యాగింగ్ నివారణకు విద్యా సంస్థల్లో కమిటీలను వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేందర్, లీగల్ సోషల్ వర్కర్ శంకర్, న్యాయవాదులు భూమయ్య, వరలక్ష్మి, షానవాజ్, లీగల్ వలంటీర్ సుజాత, మెడికోలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం


సతీశ్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలం చందనాపూర్ సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మేస్త్రీజుల సతీశ్(35) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సతీశ్ కొంతకాలంగా నిత్యం మద్యం తాగుతున్నాడు. ఈక్రమంలో 4నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చూపించుకోగా.. పరిక్షించిన వైద్యులు.. మద్యం తాగొద్దని సూచించారు. అయినా, వినకుండా మద్యం సతీశ్ మద్యం తాగుతూనే ఉన్నాడు. ఈక్రమంలో అతడి భార్య సుమలత తన ఇద్దరు పిల్లలతో కలిసి సంక్రాంతి పండుగ కోసం తన పుట్టింటికి వెళ్లింది. దీంతో శుక్రవారం రాత్రి తనకు కడుపునొప్పి వస్తోందని భార్యకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత శనివారం ఉదయం ఇంటి ఎదుట ఆవరణలోని రేకుల షెడ్డుకు ఉరేసుకొని చనిపోయాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టూటౌన్ సీఐ వేణుగోపాల్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లికి చెందిన ఓడ్నాల ప్రభాకర్ శని వారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఓడ్నాల కిష్టస్వామికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు ప్రభాకర్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రభాకర్ భార్య లావణ్యతోపాటు కూతురు రక్షిత సంక్రాంతి పండుగ నేపథ్యంలో తమ పుట్టింటికి వెళ్లారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ప్రభాకర్.. శుక్రవారం రాత్రి భోజనం చేసి తన గదిలో పడుకున్నాడు. తెల్లవారుజామున తండ్రి కిష్టస్వామి వెళ్లి చూసేసరికి ప్రభాకర్ ఇంటి పైకప్పు ఇనుపపైపుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

రెండు ఏరియాల అధ్యక్షుల ఏకగ్రీవం

గోదావరిఖని: సింగరేణి అధికారుల సంఘం ఎన్నికల్లో రెండు ఏరియాల్లో అధ్యక్ష పదవులు ఏకగ్రీవం అయ్యాయి. అధికారికంగా ప్రకటించనప్పటికీ రెండు ఏరియాల్లో ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవంగా మారింది. నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో పూర్తికాగా 12 ఏరియాల అధ్యక్షులతోపాటు మిగతా పోస్టులకు నామినేషన్లు పెద్దసంఖ్యలో వచ్చాయి. అయితే ఆర్జీ-2 ఏరియా అధికారుల సంఘం ఎన్నికల్లో ఓసీపీ-3 ప్రాజెక్టు అధికారి ఎస్.మధుసూదన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఈపదవి ఏకగ్రీవం అయ్యింది. బెల్లంపల్లి ఏరియాలో అడిషనల్ మేనేజర్‌గా పనిచేస్తున్న టి.మధుసూదన్ కూడా అధ్యక్ష పదవికి ఒక్కటే నామినేషన్‌దాఖలు కావడంతో అక్కడి అధ్యక్ష ఎంపిక లాంఛనంగా మారింది. అలాగే ఏరియా కార్యదర్శికోసం కొత్తగూడెం, మందమర్రి, బెల్లంపల్లి, ఎస్టీపీపీ ఏరియాల్లో ఒక్కో నామినేషన్ దాఖలైంది. కోశాధికారి కోసం కార్పొరేట్, ఆర్జీ-2, బెల్లంపల్లి, మందమర్రి, ఎస్టీపీపీ ఏరియాల్లో ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఎంపిక లాంఛనమే. ఉపకోశాధికారులు మణుగూరు, ఆర్జీ-2, బెల్లంపల్లి, ఎస్టీపీపీల్లో ఏకగ్రీవం అయ్యాయి.

చివరి క్షణంలో భారీగా నామినేషన్లు

అధ్యక్ష పదవి కోసం చివరి క్షణంలో భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. సాయంత్రం వరకు ఏడు నామినేషన్లు మాత్రమే వేయగా, చివరి నిమిషంలో మరో ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో సంస్థ వ్యాప్తంగా అధ్యక్ష పదవి కోసం 13 మంది నామినేషన్ వేశారు. సంస్థ ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొంతమంది నిరసను యాజమాన్యానికి, అధికారుల సంఘానికి తెలియజేసేందుకు నామినేషన్లు పెద్ద సంఖ్యలో వేసినట్లు ప్రచారం జరుగుతోంది. సింగరేణి స్థాయిలో రెండు వైస్‌ప్రెసిడెంట్ల కోసం 14మంది, ప్రధాన కార్యదర్శి కోసం ఆరుగురు, రెండు జాయింట్ సెక్రటరీ పోస్టుల కోసం 15మంది, కోశాధికారి కోసం నలుగురు, అసిస్టెంట్ కోశాధికారి కోసం ఐదురుగు నామినేషన్లు వేశారు.